క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్ దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంఐఎం సభ్యులు

రామగిరి : నల్లగొండ పట్టణంలోని 46వ వార్డు ప్యార్‌సబ్‌బాగ్‌లో ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో అర్హులైన 400 మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రజీయుద్దీన్, పట్టణ అధ్యక్షుడు రఫీయుద్దీన్, అబ్దుల్ మాలిక్, సయ్యద్ ఇంతియాజ్, షేక్ మోయిన్, గౌస్ మహ్మద్, మహ్మద్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తోకల వెంకన్న

చండూరు : మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 24 తేదీ నుంచి ప్రారంభమయ్యే వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ తోకల వెంకన్న కోరారు. బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 24న సుప్రభాత సేవ, 25న కుంకుమార్చన, 26న అమ్మవారి నైవేద్య నివేదన, 27న అమ్మవారి ఊరేగింపు, 28న ముగింపు రోజు మంగళ హారతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సంకోజు బ్రహ్మం, కార్యదర్శి సిద్ది అమృతాచారి, సహాయ కార్యదర్శి సంకోజు సత్యనారాయణ, మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

శాలిగౌరారం : శ్రీరామనవమి సందర్భంగా శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద ఉన్న శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం మండలకేంద్రంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు శేషభట్టర్ జగన్మోహనాచార్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 26న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం సర్పంచ్‌లు బట్ట హరిత, గౌర వీరయ్య, ఎంపీటీసీ జోగు సైదమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, నాయకులు బట్ట వీరబాబు, చింత ధనుంజయ్య, జమ్ము రమేశ్, కూతాటి సోములు, తాందారు సత్తయ్య, బండారు మహేశ్, కొయ్యడ శివశంకర్, రవీందర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కేతేపల్లి : అకాల వర్షాలు, వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల వల్ల 40 నుంచి 50 శాతం దెబ్బతిన్నాయన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయి పర్యటించి ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సత్తయ్య మృతి

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అర్రూరి సత్తయ్య(70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. సత్తయ్య మృతదేహాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్, మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, కొంపెల్లి వెంకట్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు టీకుల అంజిరెడ్డి, చీమల వీరేశం, పందిరి సతీష్, యూసూఫ్ పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశం

మాడుగులపల్లి : రంజాన్ ఉపవాసాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి ఎస్ఐ కొగూరి నరేష్‌కుమార్ ముస్లిం మతపెద్దలు, స్థానిక నాయకులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ఉపవాస దీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే పోలీసుశాఖ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఉపవాస దీక్షకు పోలీస్‌శాఖ అన్నివిధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. శాంతిభద్రతల సంరక్షణకు పోలీసులకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

ఘనంగా ఉగాది వేడుకలు



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నకిరేకల్‌లో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ప్రత్యేకంగా అలంకరించబడిన దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ అమ్మవారు

రామగిరి (నల్లగొండ) : శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం 50 మంది వేద పండితులు, కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు, యోగా గురువులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కనగల్ ఎంపీపీ ఎస్‌కె. కరీం పాషా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు చీర పంకజ్‌యాదవ్, సత్తయ్యగౌడ్, బొర్ర సుధాకర్, బక్క పిచ్చయ్య, మాలే శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, కంచనపల్లి రవీందర్‌రావు, బకరం వెంకన్న, టీఎస్‌జీఓ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఉగాది పంచాగ శ్రవణం

ఉగాది పండుగ సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. అదేవిధంగా పట్టణంలోని గాంధీనగర్ పార్కులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

ఉగాది పండుగ సందర్భంగా క్లాక్ టవర్ సెంటర్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ళ వెంకటేశం, జన



నక్కలపల్లిలో పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సైదులు, శేఖర్‌రెడ్డి, సీహెచ్.అరుణ, గేర నరసింహ, నల్లపు రాజు వెంకన్న, రమాదేవి, మురళి, సైదులు, శ్యామ్ కుమార్, నరసింహ, రవీందర్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. మండలంలోని నక్కలపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకుడు జానకిరామశర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. చెర్వుగట్టు ఆలయంలో పోతులపాటి రామలింగేశ్వర స్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు దూదిమెట్ల స్రవంతి వెంకటేశ్వర్లు, మల్గ బాలకృష్ణ, మేడి పుష్పలత శంకర్, ఈద మాధవినర్సింహ, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, దుబ్బాక పావని శ్రీధర్, ఆలయ చైర్మన్ బండారు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణు, పసునూరి రవీందర్, దయాకర్, భిక్షమయ్య, భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ శ్రీ శోభకృత్ నామ పంచాంగాన్ని చదివి వినిపించారు. గుండ్రాంపల్లి గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ సంస్కృతి భారతి కార్యకారిణి సభ్యుడు ఉమేశ్ త్రివేది ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిట్యాలలో జరిగిన కార్యక్రమంలో పందిరి శ్రీనివాసులు, రంగా వెంకన్న, చందా రవీందర్, వేలుపల్లి రవీందర్, మేడిశెట్టి ఉమాశంకర్, గుండ్రాంపల్లిలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెరుకు మధుసూదన్‌గౌడ్, నర్సింగ్ రాజు, గరిషె శేఖర్, పభాకర్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : ఉగాది వేడుకలను నకిరేకల్ పట్టణంలో ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నకిరేకల్‌లోని శివాలయం, శ్రీ షిర్డీసాయి మందిరంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, పూజర్ల శంభయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి శివాలయ, షిర్డిసాయి మందిర అధ్యక్షులు ఉప్పల సంతోష్, కాసం లింగయ్య, బొల్లం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సహజ ప్రకృతి పానీయాలు సేవించాలి

ఆరోగ్యానికి హాని కలిగించే కృత్రిమ కార్బొనేటెడ్ కూల్ డ్రింక్‌లను మానుకుని సహజ ప్రకృతి పానీయాలు పండ్ల రసాలను సేవించాలని నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఉగాది పండుగను పురస్కరించుకుని నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో జన విజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, పానీయం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యాన వన అధికారి విద్యాసాగర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యుడు కసుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, ప్రతినిధులు వాలుగొండ వెంకటేశ్వర్లు, వంటిపాక నగేష్, చల్లోజు శ్రీనివాస్, సుధాకర్, భద్రయ్య, దామోదర్ పాల్గొన్నారు.

మునుగోడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజలు బుధవారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం పలు ఆలయాల్లో పురోహితులు పంచాగ శ్రవణం చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల వ్యాప్తంగా బుధవారం ఉగాది సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం మండల కేంద్రంలోని శ్రీసాయి మణికంఠ ఆలయంలో పూజారి కొటారు సత్యనారాయణ శర్మ, ఆంజనేయస్వామి ఆలయంలో పెండ్యాల శివప్రసాద్‌శర్మ పంచాంగం చదివి వినిపించారు. వనమా లింగయ్య, ఇల్లెందుల కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రాంమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలో..

శాలిగౌరారం : మండలంలో ఉగాది పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు పంచాంగం చదివి వినిపించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు శేషభట్టర్ జగన్మోహనాచార్యులు, పురోహితులు రామడుగు వెంకటరామశర్మ నేతృత్వంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం సర్పంచ్‌లు బట్ట హరిత, గౌర వీరయ్య, ఎంపీటీసీ జోగు సైదమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, సీఈఓ నిమ్మల ఆంజనేయులు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల) : చండూరు, గట్టుప్పల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం ప్రజలు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. గట్టుప్పల మండల కేంద్రంలో బ్రహ్మశ్రీ మాడ కృష్ణమూర్తిశర్మ పంచాంగ శ్రవణం చేశారు.

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



గంధంవారిగూడెంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న పిల్లి రామరాజుయాదవ్



రామగిరిలోని రామాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితులు



నల్లగొండలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న హిందూ వాహిని సభ్యులు



వైకుంఠ నగర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ బొద్దుపల్లి లక్ష్మి



నకిరేకల్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్



మునుగోడు అయ్యప్ప ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు



కట్టంగూర్ : ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న పూజారి శివప్రసాద్ శర్మ



కేతేపల్లి : ఇనుపాములలో పంచాంగం వింటున్న ప్రజలు



నల్లగొండలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



చిట్యాల శివాలయంలో పంచాంగం చదివి వినిపిస్తున్న పురోహితుడు వాసుదేవశర్మ



శాలిగౌరారంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు



గట్టుప్పల మండల కేంద్రంలో పంచాంగం వింటున్న గ్రామస్తులు

రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కనగల్ : ఉగాది పండుగ సందర్భంగా దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో తమకు సకల శుభములు కలగాలని ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారి వద్ద భక్తులు మొక్కులు మొక్కుకున్నారు. అదేవిధంగా ఆలయం వద్ద అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు.

యువ కవికి సన్మానం



కిరణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

కనగల్ : మండల కేంద్రానికి చెందిన యువ కవి, రచయిత బచ్చగోని కిరణ్‌ను ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే కంచర్ల కంచర్ల భూపాల్‌రెడ్డి నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో షీల్డు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీం పాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, జి యడవల్లి పీఏసీఎస్ చైర్మన్ దోటి శ్రీనివాస్, కనగల్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కడారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

చిట్యాల : మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యాలయాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, కందాడి రమేష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బోయపల్లి వెంకన్నగౌడ్, మామిడి నగేష్‌గౌడ్, బోయపల్లి స్వామి, లక్ష్మయ్య, మహేష్, అశోక్, మైసయ్య, ఐద్దయ్య, ముత్యాలు, నాగరాజు, లింగస్వామి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్ట్‌పై ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

నల్లగొండ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్న తీన్మార్ మల్లన్న, సుదర్శన్ గౌడ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్, టీపీవైఎస్ జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షం, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం చౌరస్తాలో విద్యార్థి యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ కోదండరాం, విమలక్క, డాక్టర్ చెరుకు సుధాకర్ వంటి ప్రజా గొంతుకల ఇళ్లపై దాడులు చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. తక్షణమే తీన్మార్ మల్లన్నను, ఆయన సిబ్బందిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి చారి, టీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా సంపత్, కత్తుల చందన్, ఉదయ్, సాయి, శ్రీకాంత్, సందీప్, వెంకటేష్ ప్రజా సంఘాల నాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి

చిట్యాల : పట్టణంలోని మల్లన్నగుట్టపై గల ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని ఏళ్ల వంశస్తుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఏళ్ల వంశస్తులు డోలు వాయిద్యాలు, అలంకరించిన గంపలతో గుట్టపైకి వెళ్లారు. అనంతరం ఆలయంలో విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపు నిర్వహించి అగ్ని గుండాలు తొక్కారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కృష్ణా జలాల లీకేజీని పట్టించుకునే వారేరి !

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి బస్టాండ్ వద్ద కొన్ని రోజులుగా కృష్ణాజలాలు లీకేజీ అవుతున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేపట్టడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నీటి సరఫరా జరుగుతున్న సమయంలో నీరు పైపులోంచి బయటకు వచ్చి కలుషితమవుతోంది. సరఫరా నిలిచిన అనంతరం అదే పైపులోకి బురద నీరు వెళ్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. నీరు లీకేజీ కావడంతో బస్టాండ్ ఆవరణ బురదమయంగా మారి ప్రయాణికులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తిరగండ్లపల్లి బస్టాండ్ వద్ద లీకేజీ అవుతున్న కృష్ణాజలాలు

నిలువునా ఎండుతున్న వరి పొలాలు

- ఓ వైపు తెగుళ్లు.. మరోవైపు అడుగంటిన భూగర్భ జలాలు
- తీవ్ర ఆందోళనలో మునుగోడు మండల రైతులు



పలివెలలో ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న రైతు దంపతులు

మునుగోడు : ఈ ఏడాది యాసంగి సీజన్‌లో కొండంత ఆశతో వరి సాగు చేసిన రైతన్నలు అరిగోస పడుతున్నారు. మునుగోడు మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలు సాగు చేసిన రైతులు పెట్టిన పెట్టుబడి అయినా చేతికి వస్తుందా.. రాదా అనే ఆందోళనలో ఉన్నారు. ఓ వైపు పంట సాగు చేసిననాటి నుంచి తెగుళ్ల ఆశిస్తుండగా, మరోవైపు పంట చేతికి వచ్చే సమయంలో భూగర్భ జలాలు అడుగంటి పొలాలు నిలువునా ఎండిపోతున్నాయి. నాటువేసిన ప్రారంభంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా మొగిపురుగు ఆశించగా.. తీరా పొట్టకు వచ్చే సమయంలో అగ్గి తెగుళ్ల ఆశిస్తున్నాయి. దీనికి తోడు బోర్లు ఎండిపోతుండడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

పెరిగిన పెట్టుబడి..

గతంలో ఒక ఎకరం వరి పొలం నాటు వేస్తే పొలం దున్నేందుకు రూ. 3వేల నుంచి రూ. 4వేలు, నాటు వేసిన కూలి రూ.4వేలు, ఇతర ఖర్చులు రూ. 1500 చొప్పున మొత్తం రూ.9500 నుంచి రూ.10,500 వరకు ఖర్చు వచ్చేది. కానీ ఈ ఏడాది తెగుళ్ల అధికంగా ఆశించడంతో ఒక్కో రైతు తమ పొలానికి నాలుగైదుమార్లు మందులు పిచికారీ చేశారు. అందుకు ఎకరానికి దాదాపు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు వచ్చింది. దీంతో గతంలో కంటే పెట్టుబడి రూ.5 వేల నుంచి రూ.6వేలు అదనంగా వచ్చింది. తమకు వచ్చే ఆదాయం అంతా మందులకే సరిపోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన భూగర్భ జలాలు

పంట సాగు చేసిన సమయంలో పుష్కలంగా నీళ్లు పోసిన వ్యవసాయ మోటార్లు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఒక్కసారిగా తగ్గిపోయాయి. కొందరు రైతుల బోర్లు సగానికిపైగా తగ్గిపోగా, మరికొందరు రైతుల బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో కొందరు రైతులు తమ పొలాలు ఎండిపోకుండా ఇతర రైతుల బోర్లను అద్దెకు తీసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించుకుని పారించుకుంటున్నారు. ఎలాంటి అవకాశం లేని రైతులు వరి వదిలేసి ఆ పొలంలో పశువులను మేపుతున్నారు. గతంలో కంటే ఈ ఏడాది మునుగోడు మండలంలో అధికంగా 8500 లకు పైగా ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. అందులో దాదాపు 1500 ఎకరాల్లో పొలాలు ఎండిపోయినట్లు పలువురు రైతన్నలు చెబుతున్నారు. పంటలు ఎండిపోయి అప్పులపాలైన రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

ఈ ఏడాది తెగుళ్లు అధికంగా వచ్చాయి



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది వరి పంటకు అధికంగా తెగుళ్లు వచ్చాయి. గతంలో ఒకటి, రెండుమార్లు మాత్రమే చేనుకు మందులు కొట్టేవాళ్లం. ఇప్పుడు తెగుళ్లు అధికంగా ఉండి నాలుగు మార్లు కొట్టాను. గతంలో కంటే అదనంగా ఎకరానికి రూ. 5వేల పెట్టుబడి పెరిగింది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు.

–సిరగమళ్ల వెంకన్న, రైతు, చీకటిమామిడి

పొలం ఎండిపోయింది



ఈ ఏడాది బోర్లలో నీరు పుష్కలంగా ఉండడంతో నాకున్న నాలుగు ఎకరాల పొలంలో నాటు వేశా. ఇంకా నెల రోజుల్లో పంట చేతికి వస్తుందని ఆశపడ్డ నాకు తీవ్ర నిరాశ మిగిలింది. బోర్లలో నీరు తగ్గిపోవడంతో ఎకరంన్నర పొలం నిలువునా ఎండిపోయింది. దీంతో చేసేది ఏమీలేక నాకున్న రెండు గేదెలను పొలంలో మేపుకుంటున్నా.

–బొడ్డి నగేష్, రైతు ఊకొండి